# నైతిక పతనం

బీదస్థితిలో మనిషియొక్క మంచితనముగానీ, చెడ్డతనముగానీ తెలుసుకోగలము. ఎంతనీతిగా జీవించిన వాడైనా బీదస్థితిలో అవినీతికి పాల్పడవచ్చును. ఎంతజాలిగల హృదయమైనా ఆసమయంలో రాతి గుండెగా తయారుకావడానికి అవకాశం యున్నది. ఇది లోకసహజం.

వెంకట్రావు మంచి నీతిపరుడు. జాలిగుండె గల వాడు. కానీ ఆర్థిక పరిస్థితులు తారుమారైనందువల నమా సంఘము చూపిన చిన్న చూపుకునూ వెంకట్రావు తట్టుకోలేకపోయేడు. దయా దాక్షిణ్యాలు లేని క్రూరరాక్షసుడుగా తయారయ్యేడు.

భార్యయొక్క ప్రోత్సాహముమీదట, పట్నవాసపు మోజుకొద్దీ వెంకట్రావు బస్తీలో కాపురము పెట్టేడు. నిలువ చేసిన డబ్బంతా బస్తీలో హరించి పోయినది. వయోభారంతోటి, సంసారభారంకూడ వెంకట్రావు నెత్తిమీద పడ్డది. పెద్దపిల్ల లలిత అంటే వెంకట్రావుప్రాణం వదిలేవాడు. కాని ఇప్పుడో? లలిత అంటే విసుక్కుంటున్నాడు. లలితకు ఇంకా పెళ్లి చేయనందుకు ఇరుగు పొరుగు ఆడే మాటలు వినలేక పోతున్నాడు. శని విరగడైపోతే బాగుండుననిపించింది. లలితకు వరునికోసరం దేశమంతా గాలించేడు. కాని వెంకట్రావుకు కట్నం లేకుండా పెళ్లికొడుకులు దొరకడం మహాకష్టమైపోయింది.

విపరీతంగా ధరలు పెరిగి పోతున్నవి. తిండికిలేక ప్రజ తల్లడిల్లి పోతున్నారు. చాలీ చాలని జీతంలో వెంకట్రావు సంసారం మలమలా మాడిపోతున్నది. ఇంట్లోనున్న వెండి బంగారాలు మార్వాడీ కొట్లో మూల్గుతున్నవి. రోజు రోజుకి వెంకట్రావుకి గండంగా యున్నది. వీటికితోడు వెంకట్రావు ఆఫీసర్ల చీవాట్లకు కూడ తల ఒగ్గవలసి వచ్చేది. ఆఫీసర్ల మీద కోపం ఇంట్లో భార్యను, లలితను తిట్టి కసితీర్చుకొనేవాడు. వెంకట్రావుకు జీవితంమీద విసుగు కలిగింది. భార్యా, బిడ్డలను వదలి ఎక్కడికైన పారిపోదామని తలిచే వాడు. కానీ పారిపోలేక ఉక్కిరి బిక్కిరి అవుతుండే వాడు.

లలితతో వెంకట్రావు పూర్తిగా మాట్లాడడం మానివేసేడు. లలిత వెంకట్రావుకు పరమ శత్రువై పోయినది. లలితకు తాను చేసిన గొప్ప నేరమేమిటో అర్థం కావటం లేదు. ప్రపంచంలో తండ్రులంతా పిల్లలపట్ల ఇలాగే కఠినంగా ప్రవర్తిస్తారు కాబోలు ననుకొన్నది. ఆ పసి హృదయంలో ఏవో భావాలు రేకెత్తేవి. కానీ అవి తీరని కోరికలని లలిత తెలుసు కొన్నది. అయినా ఊరుకొనలేకపోయినది. ప్రక్కయింటి అమ్మాయి కట్టుకొన్న గులాబీరంగు జార్జిట్ చీర కొనిపెట్టమని తల్లిని వేధించింది. కాని పార్వతి కంటనీరు చూచి లలిత మళ్లీచీరను గురించి ప్రస్తావించలేక పోయినది. ఇంట్లోరోజూ నాన్న అమ్మను ఎందుకు కసురుకుంటున్నాడో ఆలేత హృదయానికి అర్థమయ్యేదికాదు. వెంకట్రావు గొంతుకు వినేటప్పటికి లలిత భయంతో చాటుకు వెళ్ళిపోయేది.

---

ఆనాడు అన్నంలో నంజుకోడానికి కూరలు ఏమి లేవు. వెంకట్రావు రాకముందే లలిత కోసరం పార్వతి వడియాలు వేపి అన్నం పెట్టింది. కాని అకస్మాత్తుగా వెంకట్రావు ఇంట్లో అడుగు పెట్టేడు. తోటి గుమస్తాతో దెబ్బలాడేసి యింట్లోకి వచ్చి రుస రుసలాడుతున్నాడు. వెంకట్రావు లలిత కంచంవైపు రాక్షసుడులా గుడ్లు ఉరిమి చూస్తున్నాడు. లలితచేతిలోని ముద్ద అప్రయత్నంగా జారిక్రిందపడిపోయింది. వెంకట్రావు కోపం పట్టజాలక పోయాడు. కంచంలో నున్న వడియాలు లాక్కొని వీధిలో గిరాటవేసేడు. "కూతుర్ని ఇంట్లో కూర్చోపెట్టి మేపుతున్నావు" అని భార్యను మొఖం వాచేటట్లు చీవాట్లు వేశాడు. లలిత పొంగివచ్చే దుఃఖాని దిగమ్రింగుకొని కంచం వద్దనుండిలేచి వెళ్ళిపోయింది. నాన్నకు తనంటే ఎందుకా పగ? లలితకు ఎంత ఆలోచించినా అర్థం కావటంలేదు. ప్రపంచంలో ఆడపిల్లగా పుట్టడమే గొప్ప అపరాధమేమో! అని భావించినది. పరుపు మీద పడుకొని చాలసేపటి వరకు వెక్కి వెక్కి ఏడ్చింది. తండ్రి ఆఫీసుకు వెళ్ళేక తల్లివచ్చి భోజనం చేయమని బుజ్జగించింది. కానీ లలితకు మళ్లీ భోజనం

చెయ్యడానికి మనస్సు అంగీకరించలేదు. సాయంత్రం దాక అలాగ ఏడుస్తూనే నిద్రపోయింది. దీపాలు పెట్టేవేళకు లలిత శరీరం సల సల కాగిపోతూ జ్వరం తీవ్రంగా వచ్చింది. డాక్టర్ని పిలుచుకొని రమ్మని పార్వతి వేడుకొన్నది. కానీ వెంకట్రావు నిరాకరించేడు. రెండురోజులు జ్వరం కాచి అదే తగ్గుతుందిలే అని అనేసి ఊరుకున్నాడు. కానీ వారం రోజులైనా జ్వరం తగ్గుమొఖంపట్టలేదు. డాక్టర్ని పిలువమని పార్వతి భర్తకాళ్ళమీదపడి వల వలా ఏడ్చింది. కానీ వెంకట్రావు రాతిగుండె కరుగలేదు. ఏవో సాకులు చెప్పి తప్పించుకున్నాడు.

ఆనాడు వెంకట్రావు ఆఫీసునుండి కాళ్ళీడ్చుకుంటూ పార్కులోకి వెళ్ళేడు. మనస్సంతా ఎందుకో కలవరంగా యున్నది. ఇంటివైపుకి వెళ్ళేసరికి వెంకట్రావు భయంతో వణికిపోయ్యేడు. భార్యా, పిల్లలూ, తన కాళ్లకు పెనవేసుకొన్న క్రూర సర్పాలవలె కనుపించేరు. వెంకట్రావు లలితతో మాట్లాడి సరిగ్గ నెలరోజులయిపోయింది. లలిత అంటే తనకెందుకు అయిష్టత కలిగింది? వెంకట్రావుకు బోధపడలేదు. తాను ఇలా మారిపోవడానికి కారణం ఎవరు? ఏవేవో ఆలోచనలు వెంకట్రావు మెదడులో పరుగెత్తుతున్నవి. ఆకాశమంతా నిర్మలంగా యున్నది. మినుకు మినుకు మంటూ వీధిలో దీపాలు వెలుగుతున్నవి. మసక చీకట్లు నలువైపుల ఆవరించి యున్నది. అకస్మాత్తుగా ఆకాశంనుండి ఒకనక్షత్రం రాలిపోయింది. వెంకట్రావు గుండెల్లో ఎందుకో గతుక్కుమన్నది. గుండెలు వేగంగాకొట్టుకుంటున్నవి. రెండడుగుల్లో యిల్లు చేరుకున్నాడు యిల్లంతా నిశ్శబ్దంగా యున్నది. పార్వతి వంటింట్లో పనిచేసుకుంటున్నది. వెంకట్రావు లలిత మంచం వద్దకు వెళ్ళేడు. లలిత నిశ్చలంగా నిద్రపోతున్నది. 'లలితా' అని వణుకుతున్న గొంతుతో పిల్చేడు. కాని చలనంలేదు. లలిత విశాలనేత్రాలు లోతుకు దిగజారి పోయినవి. చంపలమీద కన్నీటి చారలు, అస్పష్టంగా కనబడుతున్నవి. లలిత కన్నీటిని వెంకట్రావు యీనాడు అర్థంచేసుకున్నాడు. లలిత యెడల తాను చూపిన క్రౌర్యానికి చింతించాడు. 'లలితా' అని మళ్ళీపిలిచాడు కాని లలిత శాశ్వతంగా యీలోకాన్ని విడిచిపెట్టి పోయింది. తీయని కోర్కెలన్నిటిని చంపుకొని కన్నీటితో వెళ్ళిపోయింది. లలిత మధుర స్వప్నాలన్నీ మంటగలసిపోయినవి. లలితా అని మళ్లీ బిగ్గరగా కేక వేశేడు. ఆకేకవిని వంటింట్లోనుంచి పార్వతి పరిగెత్తుకొచ్చింది. వెంకట్రావు కుప్పలా కూలిపోయేడు. "కర్మం చేసుకొని యీపాపిష్టి కడుపున పుట్టేవు. నీ ఆశలు తీర్చలేక పోయేను లలితా" అని వెంకట్రావు కుళ్ళి కుళ్ళి ఏడ్చేడు. లలితకు పువ్వులంటే ఎంతో యిష్టం. కానీ ఒక్కనాడైనా తాను పువ్వులు కొని యివ్వలేక పోయేడు. స్వయంగా బజారునుండి పూలు తెచ్చి లలిత తలనిండుగా శృంగారించాడు. లలిత గులాబి రంగు జార్జిట్ చీరతో పెళ్ళికూతురువలె తయారయింది. నుదుట కుంకుమ బొట్టు కళకళ లాడుతోంది. వెంకట్రావు పూర్తిగా పిచ్చివాడై పోయాడు. శవం యిల్లు దాటేవఱకు వెంకట్రావు పదేపదే లలిత పాదాలు కళ్ళకద్దుకొన్నాడు.

లలిత మట్టికలసి దినాలు, వారాలు గడిచిపోయింది. కానీ తన నైతిక పతనానికి కారకులెవరో ఇప్పటికీ వెంకట్రావుకి అర్థం కావటంలేదు.

బి. యస్. మణి